# శవ జాగరం

ఆంధ్రుల ఆవేశంలా లారీ టౌను సెంటర్లో మంచి స్పీడుగా దూసుకుపోయింది. అంత స్పీడులోనూ ఊరి బయటికి వచ్చిన లారీకి కేంద్రనాయకుల అభయహస్తాల్లాంటి చేతులు కనిపించాయి. వాగ్దానాలతే ఆరిపోయే ఆంధ్రుల ఆవేశంలా లారీ ఠపీమని ఆగిపోయింది. బ్రేకులు తగిలిన చక్రాలు బిగ్గరగా మూలిగాయి - ఉద్యమాల్లో సమిధలయ్యే సాధారణ మనుష్యుల్లా!

మమ్మల్ని ఎక్కించుకోండంటే మమ్మల్ని ఎక్కించుకోండని 'ఘెరావ్' చేస్తున్న విద్యార్థుల్లా, జనం లారీ కేబిన్ చుట్టూ మూగారు. టాప్‌పై నుంచి దిగిన సత్తిబాబు జనాన్ని క్రమపద్ధతిలో ఉంచటానికి పోలీసులా ప్రయత్నిస్తున్నాడు.

చౌదరి కొత్త సిగరెట్టు వెలిగించి వేలాయుధం తంబి వైపు చూచాడు.

యజమాని భావన వేలాయుధం తంబికి అర్థమయింది. అందర్నీ ఎక్కించుకొందామని ఆయన ఉద్దేశ్యం.

ముల్కీ రూల్సు గొడవ పుణ్యమా అని రైళ్ళు, బస్సులు, తదితర వాహనాలు అన్నీ ఆగిపోయాయి. ప్రైవేటు వాహనాలను అడుగడుగునా ఆపి చందాలు వసూలు చేస్తున్నారు విద్యార్థులు.

ఈ పరిస్థితిని ఆధారం చేసుకొని చౌదరి బెజవాడ దాటిన దగ్గర్నుంచి రెండు చేతులా డబ్బు సంపాదించాడు. ఆయన అదృష్టమేమోకాని బెజవాడ దాటిన దగ్గర్నుంచి చందాల కోసం ఆపిన చేతులకన్నా, లారీ ఎక్కడం కోసం ఆపిన చేతులే జాస్తి. డబుల్ చార్జీ వసూలు చేశాడు.

అయితే, ఇంతవరకు పరిస్థితి వేరు, ఇక ఎదుర్కోవలసిన పరిస్థితి వేరు.

అర్ధరాత్రి అయింది. టాపెక్కిన పాసెంజరుకూడా నిద్రకు బానిసయ్యేటైము. కాగా ఇక్కడినుంచి రోడ్డు బాగుండదు. అన్నిటికన్నా మించి రాబోయే పోలీసుస్టేషనులో హెడ్డు!

క్షణంలో సగం సేపు ఈ ఆలోచనలు వచ్చాయి వేలాయుధం తంబి బుర్రలోకి. చౌదరి వైపు తిరిగి అన్నాడు; 'సార్.... రోడ్డు నల్లాయిల్లే సార్. పైగా వంకర్లు రోడ్డు పొడుగునా'

చౌదరి ఉలిక్కిపడినట్లయి వేలాయుధం కళ్ళలోకి చూచాడు. 'వీడు గాని నేను డబ్బు సంపాయిస్తున్నానని అసూయ పడటం లేదు కదా?'

'రొంబానిజం సార్. పైగా మధ్యలో రోడ్డుమీదదనా పోలీస్ స్టేషన్ ఉండాది. అక్కడ హెడ్డు రొంబా సెడ్డవాడు, సార్. లారీ ఆపేసి జేబులోదంతా గుంజేస్తాడు.'

చౌదరి ఒక్క క్షణం ఆలోచించాడు.

నిజమే. పొద్దు పోయింది. లారీ అసలే ఓవర్‌లోడ్ అయి ఉంది - పసుపు బస్తాలతో.

సమయానికి మరో లారీ లేక ఒకటిన్నర లారీలకు సరిపడే సరుకును ఒక్క లారీకే ఎత్తించాడు తను.

తను లారీ వెంట వచ్చింది సరుకును సురక్షితంగా విశాఖపట్టణం చేర్చటానికి, విశాఖపట్టణం నుంచి స్మగుల్డ్ సరుకును తీసుకెళ్ళటానికి

'సత్తి బాబూ!'

'అయ్యా!'

'పక్కనున్న టౌన్‌దాకా వెళ్ళేవాళ్ళు ఎంతమంది ఉన్నారో చూడు. ఈ లోగా మధ్యలో ఎక్కడా ఆగదు లారీ.'

'అంటే మధ్యలో రోడ్డు మీద ఉన్న పోలీస్ స్టేషన్, హెడ్డుతో పోటీకి -- లేకపోతే తగాదాకు దిగుతున్నట్లే' అనుకున్నాడు వేలాయుధం తంబి.

వేలాయుధానికి చౌదరి తత్వం ఎంత బాగా తెలుసో హెడ్డు కానిస్టేబుల్ పంతులు పద్ధతులూ అంత బాగా తెలుసు.

చౌదరి తను చేయదలచుకున్న పనిని ఎలాగైనా సాధిస్తాడు. తాను చేయమన్న పనిని చేసి వస్తే అకాశాని కెత్తేస్తాడా మనిషిని. చేయమన్న పనిని చేయనన్నా చేయలేకపోయినా వాడిని అధఃపాతాళానికి తొక్కేస్తాడు. తను అనుకున్నదాన్ని సాధించటానికి ఏం చేయటానికీ వెనకాడడు చౌదరి. ఏం చేసినా చెల్లుబాటు చేయించుకోగల నేర్పూ, పలుకుబడి ఉన్నాయి.

హెడ్డు పెద్ద వేటగాడి లాంటివాడు. అతగాడికి ఆ జి.టి.రోడ్డే వేట ప్రదేశం. పోలీస్ స్టేషన్ మాటుప్రదేశం. అక్కడ తన కుర్చీలో కూర్చునే వస్తున్న వేటను పసిగట్టేస్తాడు. పట్టటానికి ప్లాను వేస్తాడు. అతని చేత పడకుండా అటునుంచి, ఇటునుంచి పోయే వాహనాలేమీ పోయినట్లు ఎక్కడా చెప్పుకోవటం ఎరగడు వేలాయుధం తంబి.

'అవతల టౌనుకెళ్ళే పాసెంజర్లు నలుగురు, విశాఖపట్నం టిక్కెట్లు ఒకటి ఉన్నాయి, సార్'.

'వాళ్ళను ఎక్కమను - డబుల్ ఛార్జీ ఇవ్వటానికి అభ్యంతరం లేకపోతే' అందుకు సిద్ధపడంది ఒక్క పాసింజరే. నలుగురు లారీ ఎక్కారు.

అప్పటికే ఏలూరు నుంచి విశాఖపట్నం వెళుతున్న ఓ పాసెంజరు 'కేబిన్‌లో కునికిపాట్లు పడుతూ కూర్చుని ఉన్నాడు. అందుచేత నలుగురూ టాపు ఎక్కారు.

లారీ కదలబోతుండగా ఓ యువకుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు - అర్జెంటుగా వెళ్ళాలి, లారీ ఎక్కించుకోండంటూ

అతనికి ఇరవై రెండేళ్ళుంటాయి. మనిషిని చూడగానే ఎంత వాణ్ణీ ఆకర్షించే మొహం. జాలి కలిగించే చూపులు, బెంగుళూరులో చదువుతున్నాట్ట. చెల్లెలు పెళ్ళికని బయలు దేరి, బస్సులు, రైళ్ళు లేకపోవటంతో అష్ట కష్టాలు పడి అంచెలు అంచెల మీద వస్తున్నాడు. ఇది

చివరి అంచె.

'ఇంతకీ ఏ ఊరు వెళ్ళాలి?' యువకుడు చెప్పాడు.

అతడు వెళ్ళవలసింది రోడ్డుపైన పోలీస్‌స్టేషన్ ఉన్న ఊరు!

ఈ పాసెంజర్ని ఎక్కించుకుంటే ఆ ఊరి దగ్గర అపాలి లారీ. అతడిని ఎక్కించుకోడనే అనుకున్నాడు వేలాయుధం.

'పైకెక్కు' అని ఠీవిగా అనేశాడు చౌదరి. 'ఈయన ధైర్యం ఏమిటా!' అనుకున్నాడు వేలాయుధం. అనుకుంటూనే లారీ 'స్టార్ట్' చేసేడు.

అయిదు మైళ్ళు పోగానే గతుకుల రోడ్డన్న వేలాయుధం మాటలు గుర్తుకొచ్చాయి చౌదరికి. మరో అయిదు మైళ్ళు పోగానే రోడ్డు పాములాగా వంకర్లు తిరగటం ప్రారంభించింది.

'అయితే, తంబీ, రోడ్డుమీద స్టేషన్‌లో హెడ్డు గట్టివాడంటావు?' సిగరెట్టు వెలిగించి పొగ వదులుతూ అన్నాడు చౌదరి.

'అమాసార్' అన్నాడు యజమాని అందించిన ఖరీదైన సిగరెట్టును పెదిమల మధ్య ఉంచుతూ.

యజమాని ఖరీదైన తన సిగరెట్టును ఇచ్చి తనతో సమానంగా డ్రైవరును చూచాడు అంటే యజమానికి అతనితో పని ఉన్నట్లే. ఈ ట్రిప్పులో ఖరీదైన తన సిగరెట్టును చౌదరి అతని కివ్వటం ఇది మూడోసారి.

'వాడి కంట పడకుండా మనం స్టేషన్ను దాటలేమంటావు?'

'నల్లా డిఫికల్టీ సార్'

'చౌదరి కేబిన్‌లో ఉన్నాడు. లారీని డ్రైవ్ చేస్తున్నది వేలాయుధం తంబి అన్న విషయం గుర్తుంది కదా?'

వేలాయుధానికి, చౌదరి 'స్పీడ్' డ్రైవింగును ఎంతగా 'లైక్' చేస్తాడో తెలుసు. నిజానికి అందుకే తనని తమిళనాడు నుంచి పిలుచుకొచ్చి తన దగ్గర పెట్టుకొన్నది. ఈ ట్రిప్పులో తననే డ్రైవరుగా చేసుకోవటానికి, తనూ రావటానికి గల కారణమూ అదే.

'థ్యాంక్యూ, సార్. స్పీడు కొట్టటానికి రోడ్డంతా కర్వులు, సార్. పైగా సరుకు ఫుల్‌గా ఉంది.'

'అందుకే నీకీ పరీక్ష. ఆ ఊరిముందు కర్వు ఉందన్నావ్ కదూ? అక్కడ డెబ్బకి తగ్గకూడదు స్పీడు. ఊరు దాటేక కుర్రాడిని దించేయి.'

'కానీ, సార్... తొమ్మిది పేణాలు'

'మన ప్రాణాల కొచ్చిన నష్టం ఏం లేదు లేవోయ్. ఏం వచ్చినా చూచుకోవటానికి నేనున్నాను. ఊరు అయిదు మైళ్ళు ఉందనగానే హెడ్ లైట్లు ఆర్పేయి.'

చౌదరి మాటను కాదనే ధైర్యం లేదు తంబికి. కాగా చౌదరి కున్నంత 'ఎడ్వెంచ

స్పిరిట్' వేలాయుధానికీ ఉంది.

లారీ స్పీడు అందుకుంది

అసలే చీకటి రోజులు, దానికి తోడు ఆకాశంలో నల్లటి మబ్బులు. అన్యాయం లాంటి ఆ చీకటిని చీల్చుకుంటూ చిన్న లైటు దారి చూపుతుంటే లారీ అరవై మైళ్ళ స్పీడు దాటి డెబ్బై అందుకొంది.

ఊరి ముందున్న పెద్ద వంపు వచ్చింది. వంపు దాటితే కాని అవతల ఏముందీ తెలియదు. చిన్న లైటుకూడా ఆర్పేశాడు వేలాయుధం.

లారీ వంపు తిరిగింది. అవతల నుంచి హెడ్ లైట్‌కాంతి. హారన్ మోత!

ఆకస్మాత్తుగా వచ్చిన ఈ పరిణామానికి ఒక్క సెకండ్ కాళ్ళు, చేతులు వణికాయి వేలాయుధానికి. మొహాన చెమటలు పట్టాయి.

డెబ్బై మైళ్ళకు పైన వేగం.... .....వంపు ఎదురుగ్గ లారీ. బ్రేకేయటానికి వీల్లేదు. వేయకపోతే ఎదురు లారీకి ఢీ కొనక తప్పదు. అంత కర్వులోనూ దాన్ని కోసుకెళ్ళాలి.

వేలాయుధం రోడ్డు ఇవతలికి లాగాడు లారీని. ఎదురుగా వస్తున్న లారీ దూసుకు పోయింది. టాపుమీద కూర్చున్న ఒకరిద్దరికి రెండూ గుద్దుకున్న భ్రాంతి కలిగింది. ఆ భ్రాంతి నుంచి తేరుకోక ముందే జరుగకూడనిది జరిగిపోయింది.

లారీ ముందు చక్రం రోడ్డు అవతలికొచ్చిమట్టి గట్టును కోసి తెంచి వొరిగింది. చక్రాలు ఆగిపోయాయి. లారీ ఒరిగింది.

వేలాయుధం డోర్ తెరుచుకుని దూకేశాడు. అతని వెంటే చౌదరి. అకాశం బిగ్గరగా ఉరిమింది. మెరిసింది తళుక్కున!

"సార్... దెబ్బలు తగల్లేదు కదా?" రోడ్డుపై నుంచి కుంటుకుంటూ వస్తున్న సత్తిబాబు కనిపించాడు.

చౌదరి మాట్లాడలేదు. సిగరెట్టు తీసేడు. అగ్గిపుల్ల వెలుగులో ఆయన కళ్ళలో ఒక వైపు పట్టుదలను, మరోవైపు ఆలోచనను చూచాడు వేలాయుధం.

అప్పుడే మెరిసిన మరో మెరుపు వెలుగులో లారీ కింద అటూ ఇటూ నిశ్చింతగా నిద్రపోతున్న ఆరు జీవాలు తళుక్కుమన్నాయి!

★——★——★

హెడ్ కానిస్టేబుల్ పంతులు, ఆహారం లేని పులి బోనులో అటూ ఇటూ తిరుగుతున్నట్లు పోలీస్ స్టేషన్‌ను దున్నేస్తున్నాడు. అతగాడి అసిస్టెంట్, పులి బోను తెరుచుకొని ఎప్పుడొచ్చి తన మీద పడుతుందోనని భయపడే కుర్రాడిలా ఓ పక్క నిలబడి హెడ్డు వైపు చూస్తున్నాడు.

అసిస్టెంటుకు తెలుసు పంతులు పద్ధతులన్నీ. అతడికి ఒక్కపూట ఏదన్నా కేసు చిక్కకపోతే పిచ్చెక్కి నట్లుంటుంది. కేసులు ఎన్ని చిక్కితే అంత ఆనందం. హెడ్డు 'జాలీ' మూడును

చూడాలంటే అదే సమయం.

పంతులు చాలా కాలం నీతీ, నిజాయితీలకు ప్రతిబింబమా అన్నంత సిన్సియర్‌గా పనిచేశాడు. అతని పేరంటే హడలి పోయేవాళ్ళు డిపార్టుమెంటలో వాళ్ళు. చేసేది సాధారణమైన కాన్‌స్టేబిల్ ఉద్యోగమే అయినా, అతని పుణ్యమా అని చాలా మంది పై ఆఫీసర్ల ప్రమోషన్లు ఆగిపోయాయని చెప్పుకుంటారు డిపార్టుమెంటులో.

అయితే, అతను 'సిన్సియర్'గా ఉన్నంత కాలం ఎదుగూ బొదుగూ లేకుండా పొయింది. పైగా అయిన వాళ్ళూ, కాని వాళ్ళూకూడా అక్షింతలు వేయసాగారు.

పద్ధతి మార్చాడు. లోకపద్ధతిని అనుసరించాడు.

తినే కొద్దీ ఆక లెక్కువ కాసాగింది. డొంకమార్గం పట్టి హెడ్డయ్యాడు. వీలుంటే వేలు, లేకపోతే కనీసం ఓకోడిపెట్ట పిండందే వదలడు పాసెంజర్లని.

ప్రొహిబిషన్ ఉండగా దోసిళ్ళతో సంపాదించాడని, అక్కడెక్కడో ఇల్లు కట్టాడని అంటారు. కొడుక్కి పెద్ద చదువే చెప్పిస్తున్నాడు. కూతురుకి ఖరీదైన అల్లుడినే కొంటున్నాడు.

కూతురు పెళ్ళి ఇంక నాలుగు రోజులే ఉంది. అయినా, తినడానికి అలవాటు పడ్డ ప్రాణం. వేట ల్లేకపోయినా ఆశచావక రాత్రంతా రోడ్డు కాస్తూ అవస్థ పడుతున్నాడు.

'అయినా నోయ్, అసిస్టెంటూ, ఈ ముల్కీ గొడవ ఇప్పుడే వచ్చి పడాలా మన ప్రాణానికి?'

'ఎస్, సార్'.

'మన నోటికాడి తిండి తీసేయటం తప్పిస్తే బస్సులు, లారీలు ఆపితేనే వస్తుందిటోయ్ ఆంధ్రరాష్ట్రం? తీరుతాయా వాళ్ళ కోరికలు?'

'తీరవు సార్'.

'ఏమిటో? పాపం చేసుకుంటే కాని పోలీసు.... కొడుక్కా డెవ్వడూ?'

విసుగ్గా కుర్చీలో కూర్చోబోతున్న పంతులు ముఖ్యమంత్రి రాజీనామా చేసినప్పుడు 'డిస్సిడెంట్' గ్రూపు పొందినంత సంతోషంతో లేచాడు.

'ఏమోయ్, అసిస్టెంటూ, ఆ దేవుడు కనికరించాడు. అదిగో, హెడ్ లైటు, బేగి సిద్ధంకా. క్విక్, సైకిళ్లు బయటికి లాగు.'

ఆ ఊరికి అటు వైపు ఒక వంపు, ఇటు వైపు ఒక వంపు. ఏ వాహనమైనా వంపు తిరక్క ముందు కనిపించవలసిందే.

వంపులో కొచ్చిందా మరి కనిపించదు.

అటు వైపు వంపు దగ్గరికి బయలు దేరా రిద్దరూ.

తీరా లారీని ఆపితే ఏ ముంది? కట్టెల లారీ. కేబిన్‌లో డ్రైవరు, క్లీనరు!

'ఏమిటోయ్? ఎక్కడి నుంచి రావటం?'

'అయిదు రోజుల క్రితం విశాఖ పట్టణం వెళ్ళేం కదా సార్, లోడ్ వేసుకొని. లోడ్ దించేసి వద్దామంటే రానీందే విద్యార్థులు? పైసా ఖర్చులేకుండా లారీ ఎక్కి రాత్రింబవళ్లు తిరిగేరు సార్, స్టూడెంట్సు. కాఫీలన్నా పోయించారు కారు. ఎట్టాగో వాళ్ళనుంచి తప్పించుకొని బీడీడబ్బులు అడుక్కొని వట్టి లారీ తీసుకు వెళుతున్నాం.'

హెడ్డు నమ్మాడు. కాని నమ్మనట్లు నవ్వాడు, ఆశ చావక!

'నా దగ్గర కాదోయ్ నీ ఏసాలు! పాతికేళ్ళ సర్వీసులో నీ లాంటోళ్ళ నెందర్నో చూసే. ఇటువంటికబుర్లెన్నో విన్నా. విశాఖపట్టణం వెళ్ళి నాలుగు రోజులున్న వాడెవడూ ఒట్టి చేతులతో రాడు. స్మగుల్డ్‌గూడ్సు ఎక్కడ దాచావో చెప్పు.'

'పోనీయ్, ఈ రేత్తిరి స్టేషన్‌లో పడుకుందాం గురో. పొద్దున్న గురూగారికి దయ పుడితే కాఫీ అన్నా పోయిస్తాడు.' క్లీనరన్నాడు గడుసుగా డ్రైవరుతో.

ఈలోగా అసిస్టెంటు సోదా మొదలు పెట్టాడు. దొరక్క దొరక్క అముదం బేరం దొరికిందని విసుక్కొంటున్నాడు హెడ్డు. సోదా ముగించి వొట్టి చేతులతో దిగుతున్న అసిస్టెంటును గమనించి హెడ్డు అన్నాడు.

'అయితే, లారీలో సరుకేం లేదంటావు? సరేపో, ఓ బీడీ ముక్కన్నా పారేసి.'

లారి ఎక్కి డోర్ వేసి ఇంజన్ స్టార్ట్‌చేస్తూ అన్నాడు డ్రైవరు ''హెడ్డుగారు బలే జోకులు వేస్తార్రా. మనం అరిని సిగరెట్టు అడుగుతామని బయం. మాదే సెకండ్ హేండ్ సరుకు, సార్. దోవ పొడుగూత అడుక్కోవటమే.'

నిలుచున్న హెడ్డు మొహంమీద నవ్వేసి లారీ కదిలిపోయింది.

లారీ ఇంజనులో పెట్రోలులా మండసాగాడు హెడ్డు!

ఇక ఆ వేళ లాభం లేదని నిశ్చయించుకొని ఇంటికి వెళదామనుకొన్నాడు హెడ్డు. కానీ అశ ... అంతరాంతరాళంలోనుంచి తన్నుకొస్తున్న తపన! పైగాఇంటికి పోతే మటుకు నిద్ర పట్టుతుందన్న గ్యారంటీ ఏముంది? మరో గంటో, అరగంటో చూద్దామని నిశ్చయించుకొని స్టేషన్‌లోనే దిగబడ్డాడు.

వేటని గురించి ఆలోచించే కొద్దీ బాధ, కోపం, దిగులు! అందుచేతనే కూతురు పెళ్ళి గురించి ఆలోచిస్తూ పడక కుర్చీలో వాలాడు.

పెళ్ళినాడు చదివింపుల కింద ఊళ్ళో వాళ్ళు అధమపక్షం వెయ్యి రూపాయలన్నా ముట్ట చెపుతారన్న ఆశ. అప్పుడే ఈ విషయం ఊళ్ళో వాళ్ళతో చూచాయగా హెచ్చరించటంకూడా జరిగింది.

అయినా, వెధవది స్వతంత్రం రాకముందు పల్లెల్లో పోలీసుటోపీ కనిపిస్తే హడిలి చచ్చేవారు. ఇప్పుడా భయమే పోయింది. అప్పటికీ, తనంటే ఎక్కడ ఏకేసులో ఇరికిస్తాడోనన్న భయముంది. వెయ్యన్నా ముట్టచెప్పక పోరు.

అయినా, అధికారులు తనని ఈ పాడు పల్లెల కేయటం ఏమిటి? పట్నాల్లో అయితే బ్లాక్‌మార్కెట్లు, పబ్లిక్ మార్కెట్లు, స్మగుల్డ్ సరుకులు వ్యభిచార గృహాలపై దాడులు - తెలివి తేటలుంటే నాలుగు చేతులా సంపాదించుకోవచ్చు. ఈ పల్లెల్లో 'రెయిడ్' చేయటానికి మంచి సానికొంపన్నా ఉండదు.

అప్పటికీ తను ఈ ఇసుక పర్రల్లో నుంచే అమృతాన్ని మథిస్తున్నాడు. కూరగాయల దగ్గర్నుంచి, కోడిపెట్టల దాకా ఊళ్ళో వాళ్లని అదిరించో, బెదిరించో గుంజుతున్నాడు. ట్రంక్‌రోడ్డు పుణ్యమా అని పదో పరకో కళ్ళ పడుతూనే ఉంది.

కాని, ఎంత కాలం ఈ అవసర నైవేద్యాలు? పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. ఇక వాళ్ళ పురుళ్ళూ, పుణ్యాలూ. బోలెడంత ఖర్చు. కాగా తనకు సర్వీసు మాత్రం ఏ మంత ఉంది? దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలంటే మంచి మంచి మహానైవేద్యాలు ఓ పదో పాతికో తగలాలి. కాని, ఎలా? ఎలా?

'మా సెడ్డ పెమాదం లెహె. సాలా మంది సచ్చినట్టుంది.'

అమృతధారల్లాంటి మాటలు!

'లారీ బాగా ఓవర్లోడు సేసేడ్లే' చెవుల్లో వారం రోజులుగా పట్టిన తుప్పు వదలిపోయింది. లేచి చివాలున బయటికొచ్చాడు హెడ్డు.

పక్క పల్లెటూరి వాళ్ళు నలుగురు ప్రమాదం వివరాలైతే చెప్పారు కాని, ఫస్టు రిపోర్టు ఇవ్వటానికి ఒప్పుకోరు.

'వచ్చిన చిక్కే ఇది వీళ్ళతో. అవతల క్రైమ్ జరిగి చావటానికి సిద్ధంగా ఉన్నా, చచ్చిపోయినా, పోలీసులకు రిపోర్టివ్వటానికి భయపడతారు జనం' అని విసుకున్నాడు ఓ క్షణం. అంతలోనే 'అవున్లే' రిపోర్టిచ్చి కోర్టుల చూట్టూ, నా చుట్టూ ఎవరు తిరుగుతారు?'' అనుకొని నవ్వుకొన్నాడు.

నిద్రపోతున్న అసిస్టెంటును లేపాడు హుషారుగా. ఆ నలుగురు వ్యక్తులను అతడి కప్పచెప్పి, ఈల వేసుకుంటూ సైకిలెక్కాడు.

★——★——★

ప్రమాదం జరిగిన తీరు, ప్రమాదానికి గురై సగం ఒరిగి పడి ఉన్న లారీని, అందులోని పసుపుబస్తాలను, లారీకి అటూ ఇటూ, క్రింద పడిఉన్న జీవాలను, లారీకి కాస్తంత దూరంలో నిలుచుని ఉన్న ఖరీదైన చౌదరిని చూడగానే హెడ్డుకు నోరూరింది. విందు భోజనం వడ్డించి ఉంది ముందు. తినటమే తరువాయి. హెడ్డు తన అదృష్టాన్ని అభినందించుకున్నాడు.

అయితే, కొన్ని మాటలు, విచారణలు అయ్యాక చౌదరి కొరకరాని కొయ్యలా కనిపించాడు. ఒకర్నొకరు అర్థం చేసుకున్నాక బేరంలోకి దిగారు. హెడ్డు వేల మీద కెక్కితే, చౌదరి వంద ఓవట్టాన దాటలేదు.

తను గట్టిగ పట్టు పడితే కోపం వచ్చి చౌదరి హైదరాబాద్ వెళ్ళవచ్చును. అప్పుడు తనకు కేసు పోతుంది. తన నోట్లో దుమ్ము పడుతుంది.

హెడ్డే దిగొచ్చాడు. బేరం అయిదు వందల దగ్గర తెగింది.

లారీలో సరుకు నార్మల్ కన్నా ఓ పిసరు తక్కువేవుంది. కేబిన్‌లో డ్రైవరు, క్లీనరు మాత్రమే ఉన్నారు. ఆ వంపు దగ్గర లారీ ఇరవై మైళ్ళ స్పీడులో మాత్రమే పోతూంది. ఆ ఊరి కుర్రాడే ఒకడు లారీకి అడ్డం వచ్చాడు. డ్రైవరు ఎంత తప్పించాలని ప్రయత్నం చేసినప్పటికీ అడ్డం పడ్డాడు లారీకి. చూడబోతే ఆత్మహత్య చేసుకోవటానికి ప్రయత్నంగా అనుమానం. తప్పించే ప్రయత్నంలో ఏక్సిల్ పట్టు తప్పింది. లారీ కింద పడి కుర్రాడు చనిపోయాడు. డ్రైవరుకు, క్లీనరుకు మైనర్ గాయాలు తగిలాయి.

అయిదు వందలు సృష్టించిన కథ ఇది. కథా రచయిత చౌదరి.

అంతా నిర్ణయమయ్యాక మా సంగతేమిటన్నట్లు చూచాయి మిగతా శవాలు!

నేలవైపు చూస్తూ వంద నోటుపైకి లాగాడు చౌదరి.

హెడ్డు నవ్వుతూ ఆ నోటు పుచ్చుకున్నాడు.

'నిజాని కిదంతా శ్మశానభూమే' అంటూ మళ్ళీ బిగ్గరగా నవ్వాడు.

★——★——★

పోలీస్ స్టేషన్‌లో గడియారం రెండు గంటలు కొట్టేసరికి అనుకున్న ప్లానంతా సక్రమంగా జరిగింది.

రిపోర్టివ్వటానికి అంగీకరించని ఆ నలుగురు మనుష్యులు వాళ్ళ మానాన వాళ్ళెప్పుడో వెళ్ళారు.

లారీ ప్రమాదం అయిన పోజిషన్ మారింది.

చక్రం కింద ఆ ఊరి ప్రయాణికుడు మాత్రమే మిగిలాడు. మిగతా వారంతా చౌదరి వంద రూపాయలు చూపించిన స్థానాలకు వెళ్ళిపోయారు.

అంతా సిద్ధమయ్యాక ఎస్.ఐ.ని పిలుచుకొచ్చి ప్రమాదం స్పాటును చూపించి కేస్ రిజిష్టర్ చేశాడు హెడ్డు.

అంత నిద్ర మత్తులోనూ కేసులో ఏదో పొరపాటున్నట్లు పసికట్టాడు ఎస్.ఐ. అదో విధంగా చూచాడు హెడ్డువైపు. హెడ్డు అదో విధంగా చూచాడు చౌదరి వైపు.

చీకట్లో మరికొన్ని ప్రాణం లేని కాగితాలు చేతులు మారాయి!

ఆకాశంలో మేఘాలు దట్టమయ్యాయి.

★——★——★

'ఏదవ నాయాల్ది. రాత్రి ఇంకా అయిపోదేం?'

ఎంతకీ తరగని రాత్రిని తిట్టుకొంటూ చేతిగడియారం చూచుకొన్నాడు హెడ్డు. మూడున్నర అయింది. ఇంత చేస్తే అరగంట నుంచేనా ఈ కాపలా?

విందుభోజనం చేసిన కడుపులా జేబు ఆనందంగా ఉంది. ఫారిన్ బ్రాందీ తాగినంత ఆనందంగా, తృప్తిగా ఉంది హృదయం. కళ్ళు మత్తుగా మూసుకొంటున్నాయి పదేపదే. ఇంటికి పోయి వెచ్చగా పడుకోక ఈ శవజాగరం ఏమిటి?

పోలీసు ఉద్యోగాన్ని ఆ అరగంటలో అరవయ్యో సారి బూతులు తిట్టుకొన్నాడు.

చల్లటి గాలి విసురుగా కొట్టింది. కప్పుకున్న కంబళీని మరి కొంచెం దగ్గరగా లాక్కొని, కుర్చీలో ముడుచుకు పడుకొని స్టేషన్ లోపలికి చూచాడు.

ఎస్.ఐ. టేబిల్‌ను, తన సీటును జోడించి, తల కింద లారీ సీటును దిండుగా అమర్చుకొని హాయిగా పడుకొని గుర్రుకొట్టి నిద్ర పోతున్నాడు చౌదరి, ఏమీ జరగనంత నిర్విచారంగా.

ఆయన్ని చూస్తే అసూయ వేసింది హెడ్డుకు. అతను నిద్ర పోతున్నందుకు కాదు. పోగలిగే పరిస్థితుల్ని కొనగలిగేటంత డబ్బున్నందుకు!

వేలాయుధం తంబి తలకు మఫ్లర్ చుట్టుకొని తలకింద మరో సీటును దిండుగా అమర్చుకొని కింద ఓ మూలగా ఉంగచుట్టుకొని పడుకున్నాడు.

ఇంతమందిని చంపిన వాడు, వాడు. అయినా, వాడి కా విచారం కాని, భీతికాని ఉన్నట్లే కనపడదు. అవతల తను ప్రాణం తీసిన వ్యక్తి శవం వాకిట్లో ఉన్నదన్న విచారంకూడా లేకుండా హాయిగా నిద్ర పోతున్నాడు.

అవును, వాడికేం? మర్రిచెట్టునీడన ఉన్న మనిషి, ఎంత ఎండ కాసినా, ఎంత పెద్ద జల్లు పడ్డా వాడు ఎండడు. తడవడు!

ఎప్పుడు ఎక్కడి కెళ్ళి సరుకు పట్టించాడో ఏమో సత్తిబాబు ఓ మూల శవంలా పడి ఉన్నాడు, సర్వాన్నీ మరచిపోయి!

వాళ్ల ముగ్గుర్నీ చూచి ఈర్ష్య పడ్డాడు హెడ్డు. "ఛీ... ఎదవ బతుకు.... పోలీసోడి బతుక్కూడా ఓ బతుకేనా?" అనుకున్నాడు. ఆలోచన మార్పుకి మనిషి కావాలనిపించింది.

'ఏమోయ్, అసిస్టెంటూ, అప్పుడే కునుకు పట్టిందా?'

అసిస్టెంటు 'సార్ సార్' అంటూ ఉలిక్కిపడి ఎటెన్షన్‌లోకి లేచి అంతలోనే మళ్ళీ గోడకి జారగిలపడ్డాడు.

హెడ్డు అసిస్టెంటును చూచి జాలిగా నవ్వుకున్నాడు.

వాడు అమాయకుడు. కొత్తగా సర్వీసులో కొచ్చాడు. డిపార్టుమెంటులో లావాదేవీ లింకా పట్టుబడలేదు. తనేం చెపితే అది చేస్తాడే కాని, భాగానికి రాడు. తనూ ఇంతవరకూ ఇవ్వలేదు. రుచిచూస్తే వదలడేమోనని తన భయం.

'ఈసారన్నా, పాపం, పదో పరకో ఇవ్వాలి'

మళ్ళీ మరో గాలితరగవచ్చి చల్లగా కొట్టింది. గాలితోపాటు ఈ తడవ నాలుగు జల్లులుకూడా ముల్లుల్లా గుచ్చుకున్నాయి, మొహం మీద.

వరండాలో ఆ చివరగా ఉన్న శవం వైపు మొట్ట మొదటిసారిగా చూచాడు హెడ్డు. 'ఈ దొంగ నా కొడుకు దాపరించాడు ప్రాణానికి' అని వందో మారు తిట్టుకొన్నాడు శవాన్ని.

గాలికి శవం మీద కప్పిన గుడ్డ రెపరెపలాడుతూంది. తలంతా తుక్కుయిందని మోసుకొచ్చిన వారు అనుకోగా విన్నాడు.

'కాదూ మరి! ఏం ముంచుకు వచ్చిందని లారీ ఎక్కినట్లు? ఎక్కాడు పో టాపుమీదనా ఎక్కటం? ఇలాంటి దౌర్భాగ్యపు నాయాళ్ళంతా ఇలా నికృష్టపు చావు చావవలసిందే.'

ఇలాటి ఆలోచన ఇది ఇరవయ్యోసారి రావటం.

వాడెవడో చచ్చినందుకు విచారించటంలేదు. చచ్చిన ఆ పీనుక్కి రాత్రంతా కాపలా కాయవలసి వచ్చినందుకు ఆ పీనుగును, పోలీసు బాషలో తిట్టుకొంటున్నాడు.

అసలు శవాన్ని అసిస్టెంటుకి వదిలేసి ఇంటి కెళ్దామనుకొన్నాడు మొదట్లో. కాని వాడికిచచ్చే భయం. పైగా నిద్ర మత్తుగాడు. వాడు నిద్రపోతే ఏకుక్కలో, నక్కలో శవాన్ని పీక్కుతింటే తెల్లారితే జనంతో చచ్చేచావు. గుర్తుపట్టలేనంతగా దెబ్బలు తగిలాయట. కుక్కలు, నక్కలుకూడా పీక్కు తింటే మరీ బీభత్సంగా తయారవుతుంది శవం. అందుకే తనకి తప్పదు ఈ శవజాగరం!

ఈ ఆలోచనా హాయిగా లేదు హెడ్డుకు. శవజాగారం చేయటమే కాక చచ్చిన ఆ వెధవను గురించి ఆలోచనలు కూడా దేనికి?

ఆలోచనలు మార్చటానికి సిగరెట్టు అగ్గిపెట్టె తీశాడు జేబులోంచి. జేబులో చేతికి మెత్తగా తగిలేయి చౌదరి ఇచ్చిన నోట్లు!

అరగంటలో అయిదు వందలు! చేసిందేం లేదు. తన తప్పేం లేదు. తాను శవాన్ని కూడా చూడలేదు. వాళ్ళు చెప్పిందంతా అవునన్నాడు. అంతే

ఆరు శవాలు ... ఓవర్ లోడుచేసిన పసుపు బస్తాలు! నిజానికిది ఖరీదైన కేసు. వేయికి పైగా రావలసినదే. సగానికి సగం తగ్గింది. మరి కాస్త బెట్టుచేస్తే మరో రెండు వందలు ముట్టుండేవేమో!

'ఊ....... పోనిద్దూ.... ఆశకు అంతెక్కడ?....... వారం రోజులుగా కాణీ లేదు.

ఈ ఆలోచనా ధోరణీ సుఖంగా లేదు హెడ్డుకు.

సిగరెట్టు వెలిగించి ఎదురుగా ఉన్న స్టూలు మీదికి కాళ్ళు జాపి కుర్చీలో చేరగిలపడ్డాడు.

తెల్లవారితే, పెళ్ళి మరి మూడురోజులే.

పెళ్ళి పీటల మీద పసుపు గుడ్డలతో భర్తచేత తలంబ్రాలు పోయించుకుంటున్న కూతురు కళ్ళముందు మెదిలింది.

కాస్త కట్నం ఎక్కువే అయినా మంచి సంబంధమే చిక్కింది. అల్లుడు బాగా చదువుకొన్నాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు. తన భార్యలాగా, తన కూతురు రాత్రంతా కళ్ళు కాయలు

కాచేలా భర్తకోసం ఎదురు చూడవలసిన అవసరం లేదు. రాదు.

భర్త అయిదింటికి జీపులో దిగుతాడు. ఇద్దరూ కలిసి టిఫిన్ చేస్తారు. షికారుకెళతారు. హోటల్లో మూన్‌లైట్ డిన్నర్ చేసి ఇంటికొచ్చి వెచ్చగా పడుకొంటారు.

హెడ్డు చివరి దమ్ము గట్టిగా లాగి సిగరెట్టు పారేసి రగ్గు బిగించి కప్పి వెచ్చగా ఒరిగాడు కుర్చీలో.

ఆ మాటకొస్తే తనకిమాత్రం ఎంతకాలం ఈ ఉద్యోగం? తన కొడుకు ఇంజనీర్ అవుతాడు త్వరలో. ఆ తరువాత తను రిటైరవుతాడు. ఆరు నెలలు కొడుకు దగ్గర, ఆరు నెలలు కూతురు దగ్గర. తాను, తన భార్య హాయిగా గడిపేస్తారు జీవితమంతా!

తన కొడుక్కి తాను చేసే ఈ ఉద్యోగం అంటేనే ఇష్టం లేదు. ఎవరితోనూ చెప్పుకోవడానికి కూడా సిగ్గు, పిచ్చి నాన్నకు!

నిన్ననే రావలసింది వాడు. వాడే కనక వచ్చి ఉంటే తనని డ్యూటీ చేయనిచ్చేవాడా - పెళ్ళికి నాలుగు రోజుల ముందు? పిచ్చినాన్న! వాడికేం తెలుసు. తన కష్టమంతా వాడి సుఖానికేనని, తాను నానాగడ్డి కరవడం వాడు వెన్నముద్దలు మింగటానికేనని?

వాడికీ మంచి సంబంధం చూచి పెళ్ళిచేయాలి. వాడూ, వాడి భార్యా చిలకా గోరింకల్లాగా షికార్లు చేస్తుంటే తానూ, తన భార్య మనువడితో ఆడుకొంటూ ఇంటిని పోలీసులా కాపలా కాయాలి!

హెడ్డు కళ్లు మూతలు పడ్డాయి.

కళ్ళముందు రెండు జంటలు - కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు - చెట్టాపట్టా లేసుకుని పార్కుల్లో పాటలు పాడుకొంటూ, కార్లలో, విమానాల్లో తిరుగుతూ, ఖరీదైన భవనాల్లో మెత్తని కుషన్ పరుపుల మీద నవ్వుకుంటూ పేలుకుంటూ సరదాగా దొర్లుతూ అతని కళ్ళముందు గిరగర తిరగసాగారు!

నిద్రలోనే తృప్తిగా నవ్వుకుంటున్నాడు హెడ్డు!

★——★——★

'సార్ - సార్....'

అసిస్టెంటు గట్టిగా కుదిపి లేపితే భారంగా కళ్ళు తెరిచాడు హెడ్డు.

'సార్ ... సార్... ఆ శవాన్ని.....'

'కుక్కలు ముట్టేయా? నక్కలు కొరికేయా? పోనీయ్ వెధవశవం!'

కళ్లు నులుముకుంటూ చిరాగ్గా అన్నాడు. నిద్రలోని కమ్మ కమ్మని కలలే అతన్నింకా గిలిగింతలు పెడుతున్నాయి.

'సార్.... ఆ శవాన్ని..........'

కోపం వచ్చింది హెడ్డుకు. తను కూతురు, కొడుకుల 'పెళ్ళి' గురించి ఆలోచిస్తుంటే

దౌర్భాగ్యపు వెధవ, శవం శవం అంటూ అపశకునపు కూతలు కూస్తాడేం?

'అసలు ఏమొచ్చిందిరా శవానికి? చచ్చిందా' అంటూ శవం వైపు చూచాడు.

ఆ కోపపు చూపుకి అప్పటిదాకా శవం కంటి గుడ్లను పొడుచుకుతింటున్న కాకి ఎగిరి పారిపోయింది. కాలి వేళ్ళను కొరుక్కుని భోజనం చేస్తున్న వీధికుక్క కాస్త వెనక్కి తగ్గింది.

గాలికి శవం పైన కప్పబడ్డ గుడ్డ బాగా తొలగింది. రాత్రి కురిసిన వానకు శుభ్రంగా కడగబడిందేమో మొహం స్పష్టంగా కనిపిస్తూంది.

హెడ్డు శవం మొహాన్ని చూశాడు. శరీరాన్ని చూచి మొహాన్ని చూచాడు. శవమే అయ్యాడు!

అతడికి సకల చరాచర ప్రపంచం స్తంభించిపోయింది. సర్వ ఆలోచనలు కొంతకాలం ఘనీభవించాయి. ప్రకృతి జడపదార్ధంలా గోచరించింది. ఎదురుగా అప్పుడే వచ్చి నిలబడ్డ ఉదయభానుడు నల్ల నయ్యాడు. సర్వం అంధకారం. సర్వస్వం చలనరహితం అయిందో క్షణం.

హెడ్డు శవం క్రమంగా కదిలింది

"ఓరేయ్, బాబూ... నా కొడుకా.... నన్నన్యాయం చేశావురా, తండ్రీ?"

ఆ కదిలిన శవం హృదయాన్ని చీల్చుకొని వచ్చిన ఆ ఆక్రోశానికి నిద్రపోతున్న ఊరు మేల్కొంది. జాలిపడ్డ కాకి ఆ ప్రాంతం నుంచి తప్పుకొంది. భయపడ్డ కుక్క దూర దూరంగా జరిగిపోయింది.

అప్పుడే నిద్ర లేచి వచ్చినట్లున్న సూర్యుడిని మబ్బులన్నీ మంతనాలు సాగించి కలిసి వచ్చి గుటుక్కున మింగేశాయి.

బయటి కొచ్చిన చౌదరి, వేలాయుధం తంబి, అప్పుడే వచ్చి అంతా గ్రహించిన ఎస్. ఐ. చూపులతోనే మాట్లాడుకొని హెడ్డు దగ్గరి కొచ్చారు.

హెడ్డు తనంతవరకు తిట్టిన శవాన్ని పట్టుకుని వదల్లేదు. మీదపడ్డాడు. అణువణువునూ ముద్దు పెట్టుకున్నాడు. వెచ్చని కన్నీళ్ళలో మరిగే రక్తాన్ని కరిగించి గాయాలన్నింటినీ కడిగాడు.

"ఊరుకోవోయ్!" ఊరడిస్తూ హెడ్డును పట్టుకొని లేపబోయాడు ఎస్. ఐ.

కాని, హెడ్డు పంతులు అప్పటికే కొడుకు శవంతో లీనమైపోయాడు. ఆకాశం పగిలి కన్నీళ్ళు కారసాగాయి!

ఆంధ్రప్రభ వారపత్రిక — 3.7.1974